بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ نَحْمَدُهٗ وَنُصَلِّی عَلٰی رَسُوْلِهِ الْكَرِيْمِ وَعَلٰی عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

# హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ ఖుత్బా జుమా సారాంశము - బైతుల్ ఫుతూహ్ - లండన్

దివి: 28.03.2014 నజారత్ నస్రో ఇషాఅత్ ఖాదియాన్ తరపున

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరము హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

నేడు కూడ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం సంకేతములను గూర్చి వారు ప్రస్తావించిన వ్యాఖ్యానములు, సంఘటనలను లేదా స్వయాన ప్రజలు తెలిపిన వాటిని ప్రవేశపెట్టెదను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి. అతడు నన్ను బలపరచుచు వ్యక్తపరచిన సంకేతములను నేటి 16 జూలై 1906 వరకు ఒక్కొక్కటిగా లెక్కించినచో 3 లక్షలు దాటినవని ప్రమాణము చేసి చెప్పగలను. నా ప్రమాణమును ఎవరైనా నమ్మనిచో నేను సాక్ష్యాలివ్వగలను. ప్రతి సందర్భమున తన వాగ్దానము మేరకు అల్లాహ్ నన్ను శత్రువుల నుండి రక్షించిన, ప్రతి సమయమున తన వాగ్దానానుసారము నా అవసరాలను అతడు తీర్చిన కొన్ని సంకేతములు గలవు. తన వాగ్దానము اِنِّیْ مُهِيْنٌ مَنْ اَرَادَ اِهَانَتَکَ ప్రకారము నా పై దాడిచేయువారిని అవహేళనకు గురిచేసిన, నా పై వ్యాజ్యము వేయించిన వారిపై నాకు విజయము నొసంగిన, నా అవతరణ నుండి మొదలైన కొన్ని సంకేతములు గలవు. ఎందుకనగా ప్రపంచ ఆరంభము నుండి ఏ అసత్యునికి ఇంత సుదీర్ఘ గడువు లభించలేదు. కొన్ని సంకేతములు ఈ కాలమును చూచినచో స్పష్టమగును. అనగా ఈ కాలము ఒక ఇమామ్ పుట్టుక అవసరమని అంగీకరించును. మిత్రుల హితం కొరకు నా ప్రార్థనలు పూర్తయిన కొన్ని సంకేతములు గలవు. దుష్టులైన శత్రువులపై నా శాపపూరిత ప్రార్థనలు పూర్తయినవి. నా ప్రార్థనల వలన కొందరు వినాశకర వ్యాధుల నుండి స్వస్థత పొందిరి. వారి ఆరోగ్యము కంటే ముందే నాకు తెలుపబడెను. నా సత్యము కొరకు కొందరు పెద్ద పెద్ద వ్యక్తులు, ప్రఖ్యాత దైవస్వరూపులకు సత్యస్వప్నములు వచ్చినవి. ఉ॥ సింధ్ వాసి లక్ష మంది అనుయాయులు గల పీఠాధిపతులు, విద్వాంసులు, గులాం ఫరీద్ చాచ్డాన్ గారు. నేను స్వప్నములో చూపబడి సత్యుడని తెలుపబడినందుకు వేలాది మంది నన్ను స్వీకరించిరి. ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం స్వప్నములో వచ్చి ఈ ప్రపంచము అంతము కాబోతున్నది, ఇతడే దైవ అంతిమ ఖలీఫా, మసీహ్ మౌవూద్ అని చెప్పినందుకు కొందరు నన్ను స్వీకరించిరి. నేను పుట్టక ముందే లేదా యుక్త వయస్సుకు చేరక ముందే నా పేరు చెప్పి ఇతడే మసీహ్ మౌవూద్ అని పలువురు సూచించిరి. ఉ॥ నిమతుల్లాహ్ వలి, లుధ్యానా జిల్లా జమాల్‌పూర్ వాసి మియా గులాబ్ షాహ్.

సమాధుల వార్తలు అనగా మరణించిన వ్యక్తి స్థితులు తెలుసుకొని చెప్పగలను లేదా మాట్లాడించగలను. ఈ విషయము గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లు తెలిపిరి. చాలా కాలము క్రితము یاتون من کل فج عمیق و یاتیک من کل فج عمیق అని అల్లాహ్ తెలిపెను. నన్నెవరు ఎరుగనప్పుడు అల్లాహ్ చెప్పెను. ఇప్పుడు ఈ భవిష్యవాణి ఎంత వేగముగా పూర్తవుతుందో ఎవరైనా దీనికి సాటి చూపగలరా ?

మరల వారిట్లనిరి. చూడుము ! నేను నిజముగా చెప్పుచున్నాను. అల్లాహ్ సంకేతములను కించపరచకుము. అల్లాహ్ దీనిని ఇష్టపడడు. అల్లాహ్ గొప్ప సంకేతముగా నిన్ననే పండిత్ లేఖ్రామ్ మరణించెను. కోట్లాది మంది ఈ

భవిష్యవాణికి సాక్షులుగా నున్నారు. స్వయాన లేఖ్రామే దీనిని వ్యాపింపజేసెను. అతడు ఎక్కడికి పోయినా దీనిని ప్రస్తావించేవాడు. ఇస్లాం సత్యమునకు అతడే కోరెను. సత్యపు అసత్యపు ధర్మమునకు కోలమానముగా అతడే సూచించెను. తుదకు అతడే ఇస్లాం, నా సత్యమునకు తన రక్తముతో నిదర్శనముగా నిలిచెను. ఈ సంకేతమును తిరస్కరించుట, గౌరవించకపోవడం ఎంత అన్యాయము. ఇంతటి స్పష్టమైన సంకేతమును నిరాకరించుట స్వయాన లేఖ్రామ్ అగుట కాక మరేమి ?

అల్లాహ్ తన కృపతో ప్రతి జాతి గురించి ప్రకోపము, దయానుగ్రహ అన్ని రకాల సంకేతములు చూపెను. వాటిని వ్యర్థమని భావించుట చాలా విచారము, దురదృష్టకరము, అల్లాహ్ శిక్షకు అర్హులుగుటయే. అల్లాహ్ సంకేతములను గౌరవించని వారిని అల్లాహ్ కూడ పట్టించుకోడు. అల్లాహ్ వైపున వ్యక్తమగు సంకేతములను వివేకము గల వ్యక్తి గ్రహించి, లబ్ధి పొందగలడు. కాని దూరదృష్టిలేని వ్యక్తి దైవభీతి రహితుడై ఆలోచించనందుకు ప్రయోజనము పొందలేడు. ఎందుకనగా అతడు ప్రపంచమును, విశ్వాసములో గల స్థితిని ఆలోచించడు. దీనిని అల్లాహ్ ఇష్టపడడు. అటులైనచో హజ్రత్ మసీహ్‌ని యూదులకెందుకు తిరస్కరించిరి. మూసా అలైహిస్సలాంను ఎందుకు నిరాకరించిరి. అందరికంటే ఎక్కువ ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వలసల్లం ఎందుకు బాధలు భరించిరి. పరోక్ష విశ్వాసము లేనిదే సంకేతములను అల్లాహ్ ప్రత్యక్షము చేయడు. పరోక్ష విశ్వాస పట్టికలో లేని విషయమును ఒక మూర్ఖుడు, దుష్టుడు సంకేతమని అనవచ్చును. కాని అల్లాహ్ అలా చేయడు. అల్లాహ్ మన సంస్థకు కొరత సృష్టించలేదు. ఎవడు ఒకని ముందు తలవంచలేడు. ఈ సంస్థలో చేరిన వారిలో సంకేతము చూడని వాడొక్కడు కూడ లేడు.

మరల ఇట్లనిరి. బరాహీనె అహ్మదియ్య చదువుము. మిత్రులు, శత్రువుల గురించి ఆ కాలపు వార్తలన్నియు అందులో గలవు. 30 సం॥ల క్రితం ఈ సంస్థ నామరూపాలు కూడ లేకుండెను. స్వయాన తన జీవితము, ఎప్పటి వరకు బ్రతుకునో తెలియని వ్యక్తి ఇటువంటి గొప్ప సంకేతములను తెలుపుట అవి కార్యరూపం దాల్చుట సాధ్యమా! మొత్తం బరాహీనె అహ్మదియ్య అహ్మదీయుల గృహములోనే కాక క్రైస్తవుల, ఆరియుల, ప్రభుత్వము వద్ద కూడ గలదు. దైవభీతి కలిగిన సత్యాన్వేషులైనచో బరాహీన్ సంకేతములతోనే నిర్ణయము తీసుకోగలరు. నన్నెవరు ఎరుగని, ఎవరు ఇక్కడికి రాని, ఇప్పుడున్న సమూహములోని ఒక్క వ్యక్తి కూడ నా వద్ద లేని కాలములో ఈ వార్త అందించబడెను. ఈ భవిష్యవాణి ఊహాజనిత అయినచో ఇంత పెద్ద సమూహము ఇక్కడెందుకున్నది ? ఖాదియాన్‌లో కూడ ఎవరు ఎరుగని వ్యక్తి గురించి బరాహీన్‌లో ఇట్లనబడెను. فحان ان تعان وتعرف بين الناس۔ అనగా నీకు సహాయమందించు, నిన్ను ప్రజలలో ప్రఖ్యాతి గావించు సమయము వచ్చెను. హుజూర్ ఇట్లనిరి. నేడు భారత దేశములోనే గాక అరబ్, సీరియా, ఈజిప్టు నుండి యూరప్, అమెరికా, ఆఫ్రీకా వరకు కూడ ప్రపంచము ఎందుకు అతన్ని గర్తుపడుచున్నది. ఈ నెలలో ఖాదియాన్ నుండి 3 రోజుల వరకు అరబ్ ప్రపంచము కొరకు ప్రసారమైన కార్యక్రమాలు అరబ్ ప్రాంతములో సంచలనం సృష్టించినవి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. ఇది దైవ వాక్కు కానిచో దైవ అభీష్టమునకు విరుద్ధముగా ఒక మోసగాని ప్రణాళిక అయినచో అల్లాహ్ ఎందుకు అతనికి సహకరించెను ? అతని కొరకు ఎందుకు ఇంతటి సామాగ్రి సమకూర్చెను. వీటన్నిటిని నేనే సృష్టించుకుంటినా ? ఒక మోసగానికి అల్లాహ్ ఈ విధంగా సహకరించినచో నిష్పాపరుల సత్యమునకు ఏ ప్రమాణము గలదో మీరే సమాధానమివ్వుము. నా కాలములో చేసుకొనుటకు చంద్ర, సూర్య గ్రహణము రమజాన్‌లో సంభవించుట నా శక్తిలో గలదా! నిజమైన మహ్దీ సత్యమునకు ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం దీనిని ఒక సంకేతముగా నిర్ణయించిరి. నా ప్రకటన కాలములో అల్లాహ్ దీనిని పూర్తి చేసెను. నేను అతని వైపు నుండి కానిచో అల్లాహ్ స్వయాన ప్రపంచమును తప్పుదోవ పట్టించెనా ? నన్ను నిరాకరించు ప్రభావము ఎంత వరకు పడునో ఆలోచించి

సమాధానమివ్వవలెను. ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం, అల్లాహ్ నిరాకరణ తప్పనిసరి అగును. ఈ విధముగా ఈ సంకేతముల సంఖ్య 2,4 నాలుగు కాదు వేల, లక్షలకు చేరును. మీరు దేనినని తిరస్కరింతురు ?

అదే బరాహీన్‌లో ఇట్లు కూడ వ్రాసి యున్నది. یاتون من کل فج عمیق ఇప్పుడు మీరు స్వయాన వచ్చి ఈ సంకేతమును పూర్తి చేసిరి. మీరు వచ్చినందుకు పూర్తయిన ఈ సంకేతమును రూపుమాపగలిగినచో అలా చేయుము. నేను మరల చెప్పుచున్నాను. అల్లాహ్ సంకేతములను నిరాకరించుట సమంజసము కాదు. ఇటుల అల్లాహ్ ప్రకోపము వ్యక్తమగును. నా హృదయములో నున్నదంతయు అన్నాను. ఒప్పుకొనుట లేక నిరాకరించుట మీ ఇష్టము. నేను సత్యుడని, అతని వైపు నుండే వచ్చితినని అల్లాహ్ బాగుగా ఎరుగును.

మరల వ్యాధి నుండి స్వస్థత పొందు సంకేతములు గలవు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. సర్దార్ నవాబ్ ముహమ్మద్ అలీ ఖాన్ రయీస్ మాలియర్‌కోట్ల గారి తనయుడు ప్రాణాంతక జ్వరముతో బాధపడుచుండెను. స్వస్థత కలిగే ఆశ లేకుండా శవముగా మారెను. అప్పుడు నేనతని కొరకు ప్రార్థన చేయగా తొలగని దైవనిర్ణయమని తెలిసెను. ఓ అల్లాహ్ నేనతని కొరకు సిఫారసు చేయుచున్నాననగా అల్లాహ్ సమాధానముగా ఇట్లనెను. **من ذا الذی یشفع عندہ الا باذنہ۔** అల్లాహ్ అనుమతి లేనిదే సిఫారసు చేయు ధైర్యము ఎవరికి కలదు. అప్పుడు నేను మౌనము పాటించితిని. ఆ తర్వాత వెంటనే ఈ దైవవాణి انک انت المجاز۔ అందెను. అనగా సిఫారసుకై నీవు అనుమతించబడితివి. అప్పుడు నేను అతి దు:ఖము, బాధతో ప్రార్థన చేయగా అల్లాహ్ నా ప్రార్థనను ఆమోదించెను. బాలుడు సమాధి నుండి బయటికి వచ్చినట్లయ్యెను. ఆరోగ్య లక్షణములు కనిపించుచుండెను. చాలా బలహీనమైనందుకు ఒక సుదీర్ఘ కాలము తర్వాత అసలు రూపమునకు వచ్చి ఆరోగ్యవంతుడయ్యెను.

మరల వ్యతిరేకుల నాశనము గురించి సంకేతములు గలవు. 71వ సంకేతము సిర్రుల్ ఖిలాఫ 62వ పుటలో ఇట్లు వ్రాసి యున్నది. మార్గదర్శన భాగ్యము లేని వ్యతిరేకులకు మహమ్మారి అగుటకు నేను ప్రార్థన చేసియుంటిని. ఆ ప్రార్థన కొన్ని సంుల తర్వాత ఈ దేశములో మహమ్మారి ప్రబలి అనేక కఠిన వ్యతిరేకులు మరణించిరి. ఆ తర్వాత ఈ దైవవాణి అందెను. اے بسا خانۂ دشمن کہ تو ویران کردی۔ (అనగా నీవు అనేక శత్రువుల గృహములను నిర్మానుష్యము చేసితివి) ఆమోదించబడి మహమ్మారి అగ్ని వలె వారిపై పడి నన్ను తిరస్కరించు, నా పేరును దుర్భాలాషడు వేలాది శత్రువులను నాశనము చేసెను. మేమిక్కడ ఉుునకు పలు కఠిన శత్రువులను ప్రస్తావించెదము. మొట్టమొదటి వ్యక్తి మౌల్వి రుసుల్ బాబా అమృత్సర్ వాసి. నన్ను రద్దు చేయుచు పుస్తకము వ్రాసి, ఘోరముగా దూషించెను. ఇహలోక పలు రోజుల జీవితమును ప్రేమించి అబద్ధమాడెను. తుదకు అల్లాహ్ వాగ్దానము ప్రకారము మహమ్మారికి బలైపోమెను. మరల ముహమ్మద్ బఖ్ష్ నామము గల డిప్టి ఇన్స్‌పెక్టర్ బటాలా శత్రుత్వములో నాకు బాధ కలిగించుటకు సంకల్పించిన వ్యక్తి మహమ్మారితో అంతమయ్యెను. ఆ తర్వాత జమ్ము వాసి చరాఘ్‌దీన్ ప్రవక్తృత్వ ప్రకటన చేసి నన్ను దజ్జాల్ అనెను. స్వప్నములో హజ్రత్ ఈసా అలైహిస్సలాం నాకొక కట్టె ఇచ్చి దీనితో దజ్జాల్‌ను హతమార్చమని చెప్పెనని తెలిపెను. అతని గురించి అతని జీవితములోనే ''دافع البلاء ومعیار اہل الاصطفاء'' పత్రికలో నా భవిష్యవాణి ముద్రించబడెను. 4 ఏప్రిల్ 1906న తన రెండు కుమారులతో మహమ్మారి వలన మరణించెను. నన్ను హత్యచేయుటకు ఉపయోగించు ఈసా కట్టె, **انی لمن المرسلین۔** అను అతని దైవవాణి ఎటుపోయెను ? ఆత్మ పవిత్రము కాక ముందే మనసు మాటనే దైవవాణి అనువారిపై విచారము. (అనగా ఆత్మ పరిశుద్ధము కాక ముందే మేము చాలా పవిత్రులమైనామని భావించి మానసిక కోరికలనే దైవవాణిగా ఊహించువారు) అందుకే తుదకు వారు అవమానకర మరణము పొందుదురు. వీరే కాక ఇంకా

అనేకులు అవమానము, హింసలో హద్దులు మీరిన వారు, అల్లాహ్ ప్రకోపముతో భయపడనివారు ఎగతాళి చేయుచు అదే పనిగా దుర్భాషలాడువారు మహమ్మారితో నాశనమైరి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లు ఉపదేశించిరి. కోల్పోయిన ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వైభవమును స్థాపించుటకు, పవిత్ర ఖురాన్ సత్యమును ప్రపంచమునకు చూపుటకు నేను పంపబడితిని. ఇవన్నియు జరుగుచున్నవి. కాని కనులపై వస్త్రమున్న వారు చూడలేకపోవుచున్నారు. వాస్తవానికి ఇప్పుడీ సంస్థ సూర్యుని వలె ప్రకాశించెను. దీని సంకేతములు, నిదర్శనముల సాక్ష్యములను క్రోడీకరించినచో వీటి సంఖ్యకు సమానముగా భూమండలంపై ఏ చక్రవర్తి సైన్యము కూడ లేదు.

మరో చోట వారిట్లనిరి. అల్లాహ్ నన్ను సంస్కరణ కొరకు పంపెను. నా ద్వారా ఎటువంటి సంకేతములను చూపెననగా అసూయ రహిత, దైవభీతి గల, మంచి వివేకమునుపయోగించువారు ఈ సంకేతముల వలన ఇస్లాం వాస్తవమును మంచిగా గుర్తించగలరు. ఆ సంకేతములు ఒక్కటి రెండు కాదు వేలాది గలవు. వాటిలో కొన్నిటిని మేము మా పుస్తకము హఖీఖతుల్ వహీలో వ్రాసినాము. ఆదమ్ నుండి ఇప్పటి వరకు వచ్చిన ప్రవక్తలందరి పేర్లతో నన్ను నామకరణం చేసెను. చివరగా ఈసా మౌవూద్, అహ్మద్, ముహమ్మద్ మ'హూద్ అని నా పేరు పెట్టబడెను. ఈ రెండు పేర్లతో నేను పదేపదే సంబోధించబడితిని. మసీహ్, మహ్దీగా ఈ రెండు పేర్లకు మరో నామములు. ఇవ్వబడిన మహత్యములలో గొప్ప గొప్ప పరోక్ష విషయాలతో కూడిన భవిష్యవాణీలు కూడ గలవు. వాటిని తెలుపుట అల్లాహ్ తప్ప మరొకరికి అసాధ్యము. పలు ప్రార్థనలు ఆమోదించబడునని తెలుపబడెను. శాపపు ప్రార్థనల ద్వారా దుష్టులైన శత్రువులు హతమార్చబడిరి. ప్రార్థనను మించిన స్థానము గల సిఫారసు రూపములో పలు దుఆలు గలవు. పలు ముబాహల (సవాలు) వలన శత్రువులను అల్లాహ్ అవమానపరచెను. కొందరు ఈ కాలపు ఉత్తములు అల్లాహ్‌తో వార్త పొంది నా సత్యమునకు సాక్ష్యమిచ్చిరి. నా అవతరణకు ముందే మరణించిన కొందరు ముస్లిం మత గురువుల సాక్ష్యాలు కూడ గలవు. వారు నా పేరు, గ్రామము పేరు చెప్పి త్వరలో అవతరించు మసీహ్ మౌవూద్ ఇతడేనని సాక్ష్యమిచ్చిరి. కొందరు నా అవతరణ గురించి నా వయసు 10, 12 సం॥లు వున్నప్పుడు వార్త అందించిరి. కొందరు తమ అనుచరులకు మీరు వారిని (అనగా ఆ మహానులు తమ అనుయాయులను) చూడగలుగునంత వయసు పొందుదురని కూడ తెలిపిరి. ఆ మహ్దీ మ'హూద్ రాకకు ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నిర్ణయించిన చిహ్నములు ఉ॥ రమజాన్‌లో చంద్ర, సూర్య గ్రహణము సంభవించుట, మహమ్మారి దేశములో వ్యాపించుట వంటి సాక్ష్యాలు నా కొరకు ప్రత్యక్షమైనవి. ఇప్పుడు 14వ శతాబ్దపు 4వ వంతు కూడ పొందినాను. ఇవన్ని నిదర్శనములు, సాక్ష్యాలను ఒక చోట వ్రాసినచో అనేక భాగాలగును.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం హయాంలో అల్లాహ్ ప్రజలకు ఎట్లు మార్గదర్శనము చేసెనో అహ్మదియ్య జమాఅత్‌ను స్వీకరించు పలు సంఘటనలను ఇప్పుడు నేను తెలిపెదను.

హజ్రత్ షేఖ్ ముహమ్మద్ అఫ్జల్ గారిట్లు తెలిపిరి. నా వయసు 12 సం॥లు వుండగా మా కుటుంబములో నా పెద్దనాన్న హకీమ్ షేఖ్ ఇబాదుల్లాహ్ గారు, నా పెద్దనాన్న కుమారుడు షేఖ్ కరమ్ ఇలాహీ గారు హజ్రత్ గారి బైఅత్ చేసియుండిరి. కాని ఈ సేవకుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను లేదా వారి ఫోటోను చూడలేదు. స్వప్నములో నా ప్రాణము పోయినట్లు చూచితిని. కాని గ్రహించు శక్తి మెదడులో, దర్శన వక్తి కనులకు మిగిలే యున్నది. నా ముందొక మహాపురుషుడు కూర్చొని వున్నారు. వారి వెనుక మోకాళ్ళ వరకు శుభముగా కనిపించుచున్నవి. (అనగా ఒక పెద్దాయన కూర్చొని వుండగా వారి మోకాళ్ళ వరకు శభము కనిపించుచున్నది) నిన్ను చూచుచున్న ఈ కూర్చొని

వున్న మహాపురుషుడే మిర్జాగారని నా హృదయములో వేయబడెను. వెనుక కనిపించుచున్న శుభప్రద పాదాలు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంవి. నాకు మెలకువ వచ్చెను. ఇప్పుడు లాహోరి సంస్థలోనున్న అబ్దుల్లాహ్ ఖాన్ గారి తండ్రి ముర్తజా ఖాన్ గారిని ఉదయం వివరణ కోరితిని. నీకు మిర్జా గారి ద్వారా రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అనుసరణ భాగ్యము కలుగునని చెప్పిరి. అటులనే జరిగెను. నేను 1905లో బైఅత్ చేసినప్పటి హుజూరే స్వప్నములో నా వైపు చూచుచుండిరని నేను అల్లాహ్ ప్రమాణముగా తెలుపుచున్నాను. ఇటుల అల్లాహ్ కోరువానికి సత్పథము చూపును.

హుజూర్ ఇట్లనిరి. నేడు కూడ వారి ఆ భవిష్యవాణి ఎంతో ఘనంగా పూర్తగుచున్నది. అల్లాహ్ ఎంత అద్భుతముగా సంకేతము చూపుచున్నాడు. అల్లాహ్ వారికి ఎలా దారి చూపుచున్నాడో వేలాది మైళ్ళ దూరమున్నవారు కూడ సాక్షులుగా నున్నారు. వీరి పలు సంఘటనలను కూడ తెలిపెదను.

మాలీ ప్రాంతము Bala లో తీజా వర్గపు ఒక ప్రఖ్యాత ఇమామ్ గలరు. వారి తండ్రి ద్వారా 93 గ్రామాలు ఇస్లాంలో చేరినవి. తన తండ్రి మరణము తర్వాత వీరు ఉత్తరాధికారులైరి. అల్లాహ్ కృపానుసారము కొద్ది కాలము క్రితము అహ్మదియ్య సంస్థలో చేరు అనుగ్రహము పొందిరి. ఆదమ్ గారి కథనాను సారము వారు స్వప్నములో ఇట్లు చూచిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం వారి గృహములోని వారి గదిలో ప్రవేశించిరి. వారు హుజూర్ వెంట గదిలో వుండగా బయట చాలా విద్యావేత్తలు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం నిరీక్షణలో వున్నారు. అహ్మదియేతర విద్యావేత్తల తల నుండి టోపీ తొలగించి కేవలం నా తలపైనే టోపీ వుండనిచ్చిరి.

అహ్మదియ్య సంస్థను స్వీకరించిన తర్వాత వీరు మన ముఅల్లిమ్లతో తమ అనుచరుల అనేక గ్రామాలకు పోవుచున్నారు. ఇప్పటి వరకు 40 గ్రామాలు అహ్మదియ్య సంస్థలో చేరినవి.

మరల బోర్కినా ఫాసు వాసి జయ్యార బుఖారి గారు రేడియోకు ఫోన్ చేసిరి. అక్కడ మన వివిధ రేడియో స్టేషన్లు పనిచేయుచున్నవి. వారిట్లనిరి. నేను మీ ప్రచారమును విన్నాను. రాబోవు ఇమామ్ వీరే కాదా అని తెలుసుకొనుటకు స్వయాన హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక విధానము అనగా ఇస్తిఖార చేయవలెనని సూచించిరని అందులో తెలుపబడెను. ఆ రోజు నుండి నేను కూడ ఇస్తిఖార ప్రారంభించినాను. ఇస్తిఖార మొదలు పెట్టి ఒక వారము కాగానే స్వప్నములో ప్రకాశించుచున్న ఇద్దరు వ్యక్తులను చూచితిని. స్వప్నములోనే వారి మిత్రుడు కుడి వైపు వున్న వారు ఇమామ్ మహ్దీ అని చెప్పెను. మరో వ్యక్తిని వారు గుర్తు పట్టలేక పోయిరి. ఆ తర్వాత రాబోవు ఇమామ్ మహ్దీ సత్యుడని వారికి తెలిసెను. నవూజుబిల్లాహ్ అతడు అసత్యుడైనచో నా ఇస్తిఖారాకు సమాధానముగా నా స్వప్నములో ఎందుకు వచ్చును. అందుకే నేను బైఅత్ చేసినాను.

మరల ఈజిప్టు నుండి ఒక మహిళ నాకిట్లు వ్రాసెను. అల్లాహ్ కృపానుసారము నాకు కొన్ని విశిష్టతలు నొసంగెను. నేను స్వప్నములో హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ అలైహిస్సలాం, మిమ్ములను చూచితిని. అల్లాహ్ ప్రమాణము అప్పుడు ప్రపంచములో ఒక ఖలీఫా వున్నాడని నాకు తెలియదు. నేను ఇస్తిఖార చేయుచుండగా అల్లాహ్ నాకు వీరిద్దరిని చూపెను. కాని షైతాన్ మోసము చేసెను. ఇప్పుడు అల్లాహ్కు కృతజ్ఞతలు నాకు సత్యమును స్వీకరించుటకు అనుగ్రహించెను. ఆ మోసము నుండి నేను బయటపడితిని. నా స్థిరత్వము, క్షమాపణ కొరకు దుఆ చేయగలరు. అల్లాహ్ వారికి స్థిరత్వము ప్రసాదించుగాక!

ముఅల్లిమ్ అబ్దుల్లాహ్ గారు మాలీ నుండి ఇట్లు వ్రాసిరి. బామాకు (Bamako) లో దాంబ్లే (Dambele) గారు ఉపాధ్యాయులు. వారు అహ్మదియ్య సంస్థకు బద్ధ వ్యతిరేకులై యుండిరి. అహ్మదియ్య టెలిఫోన్ రేడియోకు

ఎప్పుడు ఫోన్ చేసినా జమాఅత్‌ను పచ్చి బూతులు తిట్టేవారు. వారికి టెలిఫోన్ చేయబడినా జమాఅత్‌ను తీవ్ర పదజాలంతో దూషించేవారు. ఇటుల వారు చేయుచు చాలా కాలము గడిచిపోయెను. ఒక రోజు వారు ఏడ్చుచు 'రబ్వాFM' నామము గల అహ్మదియ్య రేడియోకు ఫోన్ చేసి ఇట్లనిరి. వారు ఒక రాత్రి ముందు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను స్వప్నములో చూచిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వెంట నున్న కాంతిని ఇంతకు ముందు వారు చూడలేదు. కావున వారిప్పుడు సహృదయముతో జమాఅత్‌ను క్షమాపణ కోరుచున్నారు. అహ్మదీయులు క్షమించనిచో అల్లాహ్ కూడ క్షమించడని భయపడుచున్నారు. అప్పుడు ముఅల్లిమ్ గారు సత్యము స్పష్టమైనందున బైఅత్ చేయుటకు ఆహ్వానించిరి. కావున వారు బైఅత్ చేసి ఇప్పుడు అహ్మదియ్య అనగా స్వచ్ఛమైన ఇస్లాంలో ప్రవేశించిరి.

హుజూర్ ఇట్లనిరి. ఇవన్నియు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం పక్షమున అల్లాహ్ సహాయము, సంకేతములు. వీటిని సహాయము, సంకేతములని నమ్మనిచో ప్రజల హృదయాలలో సంచలనం సృష్టించుచున్నదేమిటి? ఇతర ముస్లింలు కూడ దీనిని గ్రహించుగాక! ఈ యదార్థమును తెలుసుకొనుటకు అల్లాహ్‌తో మార్గదర్శనము పొందుటకు దుఆ చేయవలెను. వ్యతిరేకత బదులు సత్పథపు అన్వేషణలో అధిక శ్రద్ధ వున్నచో అల్లాహ్ మార్గదర్శనము చేయును. అల్లాహ్ వారికీ భాగ్యము కలిగించుగాక! హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు ఉపదేశించిరి.

నేను అతని వైపు నుండేనని నిరూపించుటకు అల్లాహ్ ఎన్ని సంకేతములు చూపెననగా వాటిని వెయ్యి ప్రవక్తలలో విభజించినా ప్రవక్తృత్వము ఋజువగును. కాని ఇది అంతిమ కాలమైనందున, షైతాన్ తన సంతానముతో తుది దాడి చేయవలసియుండెను. అందుకే షైతాన్‌ను ఓడించుటకు వేలాది సంకేతములు ఒక చోట చేర్చబడెను. అయినను మానవ రూపములో గల షైతానులు నమ్మరు, అనవసరముగా విమర్శలు చేయుదురు. అల్లాహ్ స్థాపించిన సంస్థ ఏదో ఒక విధంగా నాశనము కావలెనని కోరుదురు. కాని అల్లాహ్ తను స్థాపించిన సంస్థ గమ్యానికి చేరునంతవరకు గట్టిపరచాలని కోరును.

చివరలో నేను మళ్ళీ ముస్లిం, ముస్లిం సమాజము కొరకు దుఆ విన్నపం చేయదలచితిని. అల్లాహ్ ఈ దేశాలలో శాంతి స్థాపించుగాక! శాంతిని నిజముగా స్థాపించాలంటే అందుకు ఒకే మార్గము గలదని వారు అంగీకరించుదురు గాక! అల్లాహ్ ఎవరిని ఇమామ్ మహ్దీగా పంపినాడో, ప్రపంచములో శాంతి స్థాపించుటకు ఎవరిని పంపినాడో అతన్ని స్వీకరించుదురుగాక! ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహివసల్లం భవిష్యవాణి చేసిన ముహమ్మదీయ మసీహ్‌ను స్వీకరించుదురు గాక! వారి మోక్షమునకు ఇదొక్కటే పరిష్కారము. అప్పుడే ఈ పీడనము, కలహము, బాధలనుండి విముక్తి పొందగలరు. అల్లాహ్ వారికీ భాగ్యము కలిగించుగాక!